సాక్షి మంచిర్యాల

సోమవారం । 12 । జూన్ । 2023



'ఎత్తి'పోసేదెప్పుడో..!
సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా వడ్డనపల్లి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు బీజం పడుతుందనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. 8లో▸



గాలివాన బీభత్సం
జిల్లాలో ఆదివారం కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. మందమర్రి జీఎం కార్యాలయం రోడ్డులో విద్యుత్ స్తంభాలు, చెట్లకొమ్మలు విరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42.4 /31.3
చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచే వేడి, ఉక్కపోత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో జిల్లా కవి



రవీందర్‌ను సన్మానిస్తున్న హరికృష్ణ

దండేపల్లి: తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో దండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత గోపగోని రవీందర్ పాల్గొన్నారు. తెలంగాణ ప్రగతి అనే అంశంపై కవితా గానం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌ను తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సన్మానించారు.

'సాయికుంట' కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంవీ.గుణ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని తిరుమలగిరి పక్కన సాయికుంట చెరువును అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేశారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ.గుణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. చెరువును మట్టితో పూడ్చి చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ కన్వీనర్ బొడ్డు వినోద, జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల సందీప్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు జాగిరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న శాంతికుమారి

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సబ్జెక్టు టీచర్ల కొరతను తగ్గించటానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని సూచించారు. బదిలీలు చేపట్టాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్‌పే వర్తింపజేయాలని కోరారు. జూన్ 20న విద్యాదినోత్సవం పురస్కరించుకుని డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

మోగనున్న బడిగంట

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- వెక్కిరిస్తున్న ఉపాధ్యాయ ఖాళీలు
- సమస్యలున్నా.. సర్దుకుపోవాల్సిందే..

మంచిర్యాలఅర్బన్: పిల్లల బడిబాట సమయం రానే వచ్చేసింది. సుమారు 45 రోజులపాటు ఆట పాటలతో గడిపిన విద్యార్థులు ఇక పుస్తకాల సంచి భుజాన వేసుకుని బయలుదేరాల్సిన సమయం ఆసన్నమైంది. వేసవి సెలవులు ముగియటంతో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. బడిగంట మోగనుంది. మొదటిరోజే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మౌలిక వసతులు కల్పించడంతోపాటు, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, వారంలో మూడు రోజులు కోడిగుడ్డు, ఒకసారి వెజ్‌బిర్యానీ విద్యార్థులకు అందించనున్నారు. బడుల దశ మార్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మనబడి కార్యక్రమంతో కొన్ని పాఠశాలల రూపురేఖలు మారాయి. జూన్ 3 నుంచి 9 వరకు నిర్వహించిన బడిబాట కార్యక్రమం ద్వారా 460 పాఠశాలల్లో 2,350 మంది కొత్తగా ప్రవేశాలు పొందారు.





'మన ఊరు–మనబడి'లో అన్ని హంగులతో పూర్తయిన గర్మిళ్ల పాఠశాల

పాఠ్యపుస్తకాలు చేరేనా..

పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటి వరకు మొదటి దఫాలో పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో ఇంకా చేరలేదు. జిల్లాలో జెడ్పీ, ఎంపీపీఎస్ 735 పాఠశాలలున్నాయి. కేజీబీవీ–18, ఆదర్శ–1, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్–1 ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి 8 వతరగతి వరకు 47,412 మంది విద్యార్థులు చదువుతున్నారు. 9, 10వ తరగతుల్లో 5,255 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 11 నుంచి 12 వతరగతి వరకు 6,621 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం 4,32,243 పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,81,160 పుస్తకాలు బుక్‌డిపోకు చేరాయి. 49,400 పుస్తకాలు రావాల్సి ఉంది. రెండో విడతలో 85,716 రానున్నాయి. బుక్‌డిపో నుంచి ఎమ్మార్సీకి చేరగా అక్కడి నుంచి 12 మండలాలకు చెందిన పాఠశాలలకు మాత్రమే పాఠ్యపుస్తకాలు చేరినట్లు తెలుస్తోంది. ఈఏడాది నుంచి జిల్లాకు 2.57 లక్షల నోట్‌పుస్తకాలు 6 నుంచి 12వ తరగతి వరకు అందించాల్సి ఉంది. పాఠశాలలు తెరిచిన రోజు పుస్తకాలు ఇస్తారా..? ఈనెల 20న విద్యాదినోత్సవం రోజు వరకైనా విద్యార్థులకు చేతికి అందుతాయా అనేది చూడాలి.

యూనిఫాంలు అంతంతే...

జిల్లాలోని విద్యార్థులందరికీ యూనిఫాంలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖ చెబుతోంది. ప్రభుత్వ బడుల్లో ఈఏడాది విద్యార్థులకు నూతన దుస్తులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినా ప్రారంభం రోజు విద్యార్థులందరికీ అందే పరిస్థితి కనిపించటంలేదు. కొత్తగా చేరేవారికి బడి తెరిచాకే కొలతలు తీసుకునే పరిస్థితి ఉంది. 50,032 మంది విద్యార్థులకు అవసరమైన ముడి వస్త్రం 2,32,750 మీటర్లు జిల్లాకు చేరింది. 2023–24 సంవత్సరానికి విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు డిజైన్ మార్చడంతో టైలర్లు కొంతమేర ఇబ్బంది పడుతున్నారు. మే 31లోపు టార్గెట్ విధించినా 60శాతంమేర ఏకరూప దుస్తులు కుట్టినట్లు తెలుస్తోంది.

ప్రధానోపాధ్యాయులకే ఎంఈవో బాధ్యతలు..

జిల్లాలో మండల విద్యాశాఖ అధికారుల(ఎంఈవో) పోస్టులు భర్తీ చేయడం లేదు. పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏకీకృత సర్వీస్ నిబంధనలకు మోక్షం కలగక ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టుల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి విద్యాశాఖ చేతులు దులుపుకుంటోంది. ఇన్‌చార్జీలు రెండు పదవులకు న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, చదువుతున్న విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వహణపై నిత్యం ఎంఈవోల పర్యవేక్షణ అవసరం. విద్యార్థుల ప్రగతి నివేదికలు, పాఠ్యపుస్తకాల సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ తదితర నివేదికలు తయారు చేసి జిల్లా, రాష్ట్రస్థాయిలో సమాచారం పంపాల్సి ఉంటుంది. జిల్లాలో 18 మండలాలకు ఏడుగురు ఎంఈవోలే ఉన్నారు.

బోధనకు ఇబ్బందులే..

విద్యాబోధనకు ఈ ఏడాది కూడా ఉపాధ్యాయుల కొరత తప్పేలా లేదు. వందల సంఖ్యలో పాఠశాలలు వేలా సంఖ్యలో విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయ ఖాళీలు మాత్రం భర్తీకావడం లేదు. జిల్లాలో 2,834 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 2,322 మంది విధులు నిర్వహిస్తున్నారు. 472 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 89 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. గతేడాది విద్యావలంటీర్ల నియామకం లేకపోవటంతో విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువగా ఉన్న 134 ఉపాధ్యాయులను సర్దుబాటు (డిప్యూటేషన్) చేశారు. ఈ ఏడాది వీవీల నియామకం ఉంటుందా..? మళ్లీ సర్దుబాటుతోనే సరిపెడతారా చూడాలి.

నాణ్యమైన, గుణాత్మక విద్య



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. ఇదివరకే ఉపాధ్యాయులతో పదిలో నూటికి నూరుశాతం ఫలితాల సాధనపై చర్చించాం. ఈనెల 20న విద్యా దినోత్సవం రోజు నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిస్తాం. 85 శాతం మేర పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరాయి. మన ఊరు– మన బడి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఉపాధ్యాయుల కొరతను అధిగమించటానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్దుబాటు చేస్తాం.
– యాదయ్య, డీఈవో

చెన్నూర్ సిద్ధాంతికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న దత్తుమూర్తి

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన కొమ్మెర దత్తుమూర్తి సిద్ధాంతికి ముంబైలోని కందనపల్లి కంట్రీక్లబ్ ఇంటర్‌నేషనల్ ఆస్ట్రాలజీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. దత్తుమూర్తి 25 ఏళ్లుగా సిద్ధాంతం, 35 ఏళ్లుగా జ్యోతిష్యం, 25 ఏళ్లుగా పురోహితం చేస్తూ సేవలు అందిస్తున్నందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ప్రథమ సంవత్సరం విద్యార్థులు–2,120
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు–1,906

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, మందమర్రి, చెన్నూర్, జైపూర్, జన్నారం, దండేపల్లి, బెల్లంపల్లి(బాలికలు), ప్రభుత్వ కళాశాల బెల్లంపల్లి, లక్సెట్టిపేట(ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ బాలురు), ప్రభుత్వ జూనియర్ కళాశాల లక్సెట్టిపేట, మిమ్స్, ఎస్ఆర్ఆర్, విజన్, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. 14 మంది సీఎస్, డీవోలను నియమించారు. అవసరమైన ఇన్విజిలేటర్లను కేటాయించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు చోటు చేసుకోకుండా చూడాలని సూచించారు. ప్రథమ సంవత్సరం 2,120, ద్వితీయ సంవత్సరం 1,906 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయని డీఐఈవో శైలజ తెలిపారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, సిట్టింగ్‌స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తారని తెలిపారు.

ఇంటింటికీ మోదీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి

మంచిర్యాలటౌన్: ప్రధాని నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు అందేలా పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంచిర్యాల నియోజకవర్గస్థాయి సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనపై మాట్లాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, కేంద్ర ప్రభుత్వం అవినీతికి తావులేకుండా, పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు. తెలంగాణలోనూ బీజేపీని గెలిపించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ జిల్లా పర్యటనలో జిల్లా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. ఒక ఎమ్మెల్యే శాలువా కప్పుతుంటే పక్కకు నెట్టి, అవమానించారని పేర్కొన్నారు. సీఎం జిల్లాకు భారీగా నిధులను కేటాయిస్తారని ప్రజలు ఆశించారని తెలిపారు. కానీ మొండి చేయి చూపించారని పేర్కొన్నారు. సీఎం పర్యటన జిల్లాకు నిరాశే మిల్చిందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని తెలిపారు. జిల్లా పర్యటన సందర్భంగా హామీలపై ప్రకటన చేస్తారనుకుంటే కార్మికులకూ నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ తోట మల్లికార్జున్, పెద్దపల్లి పురుషోత్తం, గుండా ప్రభాకర్, అరుముళ్ల పోశం, పానుగంటి మధు, శివాజీ, సోమారపు లావణ్య, మాధవరపు వెంకటరమణారావు, పత్తి శ్రీనివాస్, బొద్దున మల్లేశ్, బద్రి నాయక్, జోగుల శ్రీదేవి, పట్టి వెంకటకృష్ణ, మీరాజుద్దీన్, తమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ –1 పరీక్ష

- 3,167 మంది గైర్హాజరు

మొత్తం అభ్యర్థులు 9,243 మంది
హాజరు 6,076 మంది
హాజరు శాతం 65.74 మంది



రూం నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు



కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్, డీసీపీ

మంచిర్యాల అగ్రికల్చర్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాల్లో 9,243 అభ్యర్థులకు 6,076 మంది పరీక్ష రాశారు. మంచిర్యాల, బెల్లంపల్లిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను వెనక్కి పంపించారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. మొబైల్, చేతి గడియారాలు, కాలిక్యులేటర్, ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలు, షూష్, అనుమతించలేదు. లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష సజావుగా జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 10.15 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. అనంతరం పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయడంతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. గతంలో జరిగిన సంఘటనను గుర్తుపెట్టుకుని ముందస్తుగా మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

తనిఖీ చేసిన కలెక్టర్..
పాతమంచిర్యాల: గ్రూప్1 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ తనిఖీ చేశారు. బెల్లంపల్లిలోని సెయింట్ మెరీస్ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును, సీసీ కెమెరాల గదులను పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు.

కవులను ప్రోత్సహించేందుకే సమ్మేళనం

- కలెక్టర్ బదావత్ సంతోష్



కవులను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కవులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సాహిత్య దినోత్సవం నిర్వహిస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సాహిత్య దినోత్సవంలో తెలంగాణ అస్తిత్వం– తెలంగాణ సాధించిన ప్రగతిపై కవి సమ్మేళనం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ వైతాళికులు సాహితీవేత్తలు కాళోజీ, సామల సదాశివ, గూడ అంజన్న, వనామామలై వరదాచార్యులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలను ప్రభావితం చేయడంలో సాహిత్యం, కవుల పాత్ర గొప్పదన్నారు. తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించిన కవితలు చక్కగా ఉన్నాయని అభినందించారు.

అలరించిన కవితలు..
కవి సమ్మేళనంలో సల్లంగుండాలే.. సక్కగుండాలే నా తెలంగాణ కోటి రతనాల వీణై అంటూ కవితలు వినిపించారు. మూడు తరాల స్వప్నం నెరవేరి నేటి తీపి జ్ఞాపికవు అలలై హృదయాన్ని అర్థంగా మారుస్తుందంటూ.. పల్లెపట్నం ఒక్కటై బంగారు తెలంగాణ భరోసా నిచ్చే రాష్ట్రంగా పరుగులు పెడుతుందని కవితాగానంతో మెప్పించారు. అసాధ్యాన్ని అవహేళన చేసి.. ఐక్యతను ఆత్మ గౌరవోద్యమం చేసి... వలస పాలకుల కుట్రలను ఎండగట్టి.. స్వరాష్ట్ర సాధనకు నడుం కట్టిన తీరును కవితలతో చాటారు. 45 మంది కవులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. వీరికి నగదు పారితోషికం, ప్రశంసాపత్రంతో సన్మానించారు. ఈసందర్భంగా కళా ప్రదర్శనలు నిర్వహించుకునేందుకు అనువుగా జిల్లాలో ఆడిటోరియం ఏర్పాటు కృషి చేయాలని కవులు కలెక్టర్‌కు విన్నవించారు. డీఈవో యాదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుండేటి యోగేశ్వర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డీపీఆర్వో సంపత్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మధుసూదన్ నాయక్

వరదాచార్యులుకు నివాళి..
చెన్నూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెన్నూర్ పట్టణంలోని వనమామలై వరదాచార్యుల విగ్రహానికి అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదివారం నివాళులర్పించారు. సాహితీ దినోత్సవం సందర్భంగా వరదాచార్యులను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడాలి

- బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్



నినదిస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

పాతమంచిర్యాల: విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారానికి పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ఆస్పత్రి ఆవరణలోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ యువత, విద్యార్థులు వారి హక్కులు సాధించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను హీనంగా చూస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు చూస్తే ఇది అర్థమవుతుందని పేర్కొన్నారు. బీసీబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేయాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం బీసీ యువజన సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోరిశెట్టి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా గడ్డం సతీశ్‌యాదవ్, ఆర్.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా పోలంపల్లి చంద్రమోహన్, కార్యదర్శులుగా కుమ్మరి శ్రీనివాస్, కైరోజు కార్తీక్, నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీల అధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు పూదరి చంద్రమోహన్‌గౌడ్, బండి మల్లికార్జున్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి జి.రాకేశ్, అధికార ప్రతినిధి సాగర్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, నల్ల రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్లైఫోసెట్ పట్టివేత



గ్లైఫోసెట్, నిందితుడు ఇర్ఫాన్‌తో పోలీసులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో నిషేధిత గ్లైఫోసెట్ (గడ్డిమందు) స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు వాంకిడి మండలం ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ.14,800 విలువైన 10 గ్లైఫోసెట్ (గడ్డిమందు) బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడు ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగలు



రోడ్డుపై తెగిపడ్డ విద్యుత్ తీగలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని శివగూడ, బాబేఝరి, పాట్నాపూర్, గోండ్‌గూడ తదితర గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి జోడేఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అటువైపు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

గుండెపోటుతో పీఏసీఎస్ చైర్మన్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి(బెల్లంపల్లి): వేమనపల్లి మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గూడ కిషన్‌రావు (83) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం గుండెలో నొప్పి రావడంతో స్టంట్ వేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కిషన్‌రావు తెల్లవారు జామున నిద్రలోనే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఎంపీపీగా మూడేళ్లు, సర్పంచ్‌గా 25 సంవత్సరాలపాటు సేవలందించాడు. పీఏసీఎస్ చైర్మన్‌గా 18 ఏళ్లుగా పని చేస్తున్నాడు. మండలంలో సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఆయన గతేడాది బీఆర్‌ఎస్‌లో చేరాడు. అతనికి భార్య మనోహరబాయి, ఇద్దరు కూతుర్లు, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని జెడ్పీటీసీ స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ బీఎడ్ కళాశాల సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్య వెంకటేశ్ జిల్లా కేంద్రం నుంచి కళాశాలకు ఆటోలో వెళ్లాడు. ఆటో దిగుతుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తలకు గాయాలుకావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం యథావిధిగా కళాశాలకు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన సిబ్బంది వెంటనే మంచిర్యాలకు తరలించారు.

గాలివాన బీభత్సం



జీఎం కార్యాలయం ఎదుట రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

- పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన భారీ వృక్షాలు
- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు



పైకప్పు ఎగిరిపోయి తడిసిన సిమెంట్ బస్తాలు





దుబ్బగూడెంలో రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్లు

మందమర్రిరూరల్/కాసిపేట: జిల్లాలో ఆదివారం కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. మందమర్రి జీఎం కార్యాలయం రోడ్డులో విద్యుత్ స్తంభాలు, చెట్లకొమ్మలు విరిగి రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీ వేంకటేశ్వర ఆలయ ఆవరణలోని మహాలక్ష్మి ట్రేడర్స్‌లో పై కప్పు ఎగిరిపోయి సుమారు 500ల సిమెంటు బస్తాలు తడిసిపోగా రూ.2లక్షల వరకు నష్టం ఏర్పడింది. శ్రీనివాస్ ఎలక్ట్రికల్ షాపు పైకప్పు ఎగిరిపోయి సామగ్రి తడిసిపోయింది. దుర్గాదేవి ఆలయం ప్రాంగణంలో భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. కాసిపేట మండలంలోని దుబ్బగూడం, కాసిపేట, సోమగూడం తదితర గ్రామాల్లో చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దుబ్బగూడెంలో రోడ్డుకు అడ్డంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో కిలోమీటర్‌కుపైగా వాహనాలు నిలిచిపోయాయి.

పిడుగుపాటుకు వృద్ధుడు మృతి



గురువయ్య మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): పిడుగుపాటుకు వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వెల్గనూరుకు చెందిన కత్తల గురువయ్య(73) ఆదివారం పోచమ్మ ఆలయానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తుండగా ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అదేసమయంలో అతనిపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చిర్రకుంటలో 4 మేకలు, 7 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు, మేకలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చిర్రకుంటలో ఆదివారం కురిసిన వర్షానికి పిడుగుపడి 4 మేకలు, 7 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బుర్రం కిష్టయ్య, దాసరి శ్రీనివాస్ రోజువారీగా ఉదయం గొర్రెలు, మేకలను తోలుకుని మేతకోసం పక్కనే ఉన్న గుట్టచెలిమె అటవీప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడడంతో శ్రీనివాస్‌కు చెందిన 4 మేకలు, కిష్టయ్యకు చెందిన 7 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు.

'ఎత్తి' పోసేదెప్పుడో..!

- శంకుస్థాపనకు నోచుకోని 'పడ్తనపల్లి' లిఫ్ట్
- జిల్లా పర్యటనలో ఊసెత్తని సీఎం కేసీఆర్
- ప్రశ్నార్థకంగా 10 వేల ఎకరాలకు సాగునీటి సరఫరా



పథకం పూర్తయితే జలకళ సంతరించుకోనున్న కడెం కాలువ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు బీజం పడుతుందనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. 10 టీఎంసీల సామర్థ్యం, రూ.1,658 కోట్లతో నిర్మించనున్న చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన సీఎం పక్కనే ఉన్న కేవలం ఒక టీఎంసీ సామర్థ్యంతో రూ.80.50 కోట్ల నిధులు మంజూరైన పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయకపోవడంపై రైతులు నిరాశకు గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎందుకు చొరవ చూపలేదని విమర్శిస్తున్నారు.

సాగునీటి సమస్య తీరుతుందని..

దాదాపు 15 ఏళ్ల క్రితం ఆరు గ్రామాలు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపునకు గురయ్యాయి. వేలాది ఎకరాల సాగు భూములు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో కోల్పోయారు. మిగిలిన కొద్దిపాటి ఎకరాలకు సాగునీటి సమస్య తలెత్తుతున్నా ఎలాగోలా రైతులు సాగు చేసుకుంటున్నారు. రైతుల విన్నపం మేరకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంలోనే పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం ప్రకటన వచ్చింది.

నాటి ముల్కల్ల ఎత్తిపోతలను మరిపిస్తుందా?

1997లో నీటిపారుదల అభివృద్ధి సంస్థ నిర్మల్ విభాగం ఆధ్వర్యంలో ఏపీఎస్‌డీఐడీసీ, డీఆర్‌డీఏలు రూ.24 లక్షల వ్యయంతో ముల్కల్ల ఎత్తిపోతల నిర్మాణం చేపట్టింది. 30 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు పంపుసెట్లతో ముల్కల్ల శివారులోని దాదాపు 200 ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకువచ్చేలా పథకం అమలులోకి వచ్చింది. కానీ విద్యుత్ సరఫరా లోపం, విద్యుత్ బిల్లుల చెల్లింపు భారం, మోటార్లు తరచూ కాలిపోవడం వంటి కారణాలతో ఆ పథకం పూర్తిగా నిర్వీర్యమైపోవడమే కాకుండా కనుమరుగైంది. ఈ క్రమంలో పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు నోచుకోలేదు సరికదా అసలు కార్యరూపం దాలుస్తుందా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

ఎత్తిపోతల పథకం వస్తే ఇలా..

తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. జలయజ్ఞంలో భాగంగా అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేయగా 2008 జులై 28న మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య ఉన్న గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ శంకుస్థాపనకు బీజం పడింది. 62 గేట్లు, రూ.4,950 కోట్ల వ్యయంతో ఎనిమిదేళ్ల క్రితం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యింది. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలకు, పెద్దపల్లి-మంథని ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్(సుజల స్రవంతి) పథకం కింద తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎన్టీపీసీ, సింగరేణి పారిశ్రామిక అవసరాలకు కూడా నీటిని తరలిస్తున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన జరిగితే హాజీపూర్ మండల రైతాంగానికి రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని రైతులు ఆశపడ్డారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి విడుదలయ్యే 1టీఎంసీ నీరు 42 కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువకు అనుసంధానం అయ్యేది. దీంతో ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ ఎకరా తడిసి వ్యవసాయ భూములు సస్యశ్యామలం అయ్యేవి. మండలంలోని 10 వేల ఎకరాల వరకు భూములు సాగులోకి వచ్చేవి. కానీ సీఎం కేసీఆర్ ఆ ఊసే ఎత్తకపోవడంతో రైతులు భంగపాటుకు గురయ్యారు. అయితే ట్రిబ్యూనల్ అనుమతులు రాకపోవడంతోనే ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు నోచుకోలేదని కొంతమంది పేర్కొంటుండడం కొసమెరుపు.

13 నుంచి బదిలీలు, పదోన్నతులు

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి



మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

జన్నారం(ఖానాపూర్): ప్రభుత్వం ఈ నెల 13 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2003 డీఎస్సీ, సీపీఎస్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలయ్యేలా పీఆర్టీయూ కృషి చేస్తోందన్నారు. జీపీఎఫ్, ఎస్ఎల్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంఈవో విజయ్‌కుమార్, పీఆర్టీయూ అధ్యక్షుడు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జాడి మురళి, జాజాల శ్రీనివాస్, నాయకులు శివదాస్, దేవోజీ, ప్రవీణ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

కాగజ్‌నగర్‌టౌన్: ఒకరిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై అంజయ్య తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నరేష్ శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పనిచేసి ఇంటికి వస్తుండగా అదే కాలనీకి చెందిన సూరజ్, హరీష్, బంటి, రోహిత్ పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని బీరు సీసాలతో దాడి చేశారు. దీంతో నరేష్‌కు తీవ్రగాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుని సోదరుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై వివరించారు.

తేనెటీగల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: తేనెటీగల దాడిలో ఎనిమిది మంది గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మానిక్ గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడకు చెందిన ఓ కుటుంబం విత్తనపూజ కోసం మైసంలొద్దిలోని ఆలయానికి వెళ్లింది. సమీపంలోనే ఉన్న తేనెటీగలు వారిపై దాడి చేయడంతో అక్కడినుంచి పరుగులు తీశారు. వారిలో నలుగురు చిన్నారులు, నలుగురు పెద్దలపై దాడి చేసి గాయపరిచాయి. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నారాయణరావు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్(టీపీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టీపీఏ మాజీ జిల్లా అధ్యక్షుడు బి.నారాయణరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీపీఏ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ సైకాలజిస్టు నారాయణరావును నియమించినట్లు ప్రకటించారు.

వంతెన నిర్మాణానికి స్థలపరిశీలన



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి(బెల్లంపల్లి): ప్రాణహిత నదిపై అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్థల పరిశీలన చేశారు. అనంతరం మత్తడివాగును పరిశీలించి వర్షాకాలంలోగా వంతెన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, మాజీ సర్పంచ్ కుబిడె వెంకటేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు భీమయ్య ఉన్నారు.

ఇంద్రాదేవికి విత్తన పూజలు





ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి ఆలయంలో ఆదివారం విత్తనపూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ రైతులు తరలివచ్చారు. నవధాన్యాలతో కూడిన నైవేద్యం తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

– ఇంద్రవెల్లి(ఖానాపూర్)

కొరమీను..లాభాలు బాగు

- ఎకరం విస్తీర్ణంలో చెరువు తవ్వకం
- ఎనిమిది నెలల వ్యవధిలో మూడున్నర టన్నుల చేపలు దిగుబడి
- రూ.9 లక్షల వరకు ఆదాయం



కొరమీను చేపలు

దండేపల్లి(మంచిర్యాల): సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడంతో పాటు చేపల పెంపకం చేపట్టి లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్క సుగుణ, నారాయణ దంపతులు. తమకున్న ఐదెకరాల మాగాణిలో నాలుగెకరాల్లో దేశీ వంగడాలైన ఎర్రవరి, తెల్లవరితో పాటు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు పండిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో చెరువు తవ్వించి అందులో కొరమీను చేపలు పెంచుతున్నారు.

6,500 చేప పిల్లలు విడుదల

నారాయణ దంపతులు ఎకరం విస్తీర్ణంలో ఎనిమిది నెలల క్రితం చెరువును తవ్వించి అందులో 6,500ల చేప పిల్లలను వేశారు. ప్రస్తుతం రెండున్నర టన్నుల దిగుబడి వచ్చింది. మరో టన్ను వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. టన్నుకు రూ.3 లక్షల చొప్పున రెండున్నర టన్నులు విక్రయించాడు. మొత్తంగా రూ.9 లక్షల వరకు ఆదాయం సమకూరనుందని సుగుణ, నారాయణ దంపతులు తెలిపారు. చేప పిల్లలకు రూ.లక్ష, దాణాకు రూ.4 లక్షలు ఖర్చు అయ్యాయని వారు పేర్కొన్నారు. సాగుతో పాటు, చేప పిల్లల పెంపకంలో కుమారులు మురళి, పవన్, ప్రశాంత్ సహకరిస్తారని దంపతులు తెలిపారు.

మంచి దిగుబడి వచ్చింది



మా కుమారులు పవన్, ప్రశాంత్ సలహా మేరకు వ్యవసాయానికి అనుబంధంగా చేపల చెరువును తవ్వించాం. అందులో 6,500 చేప పిల్లలు వేశాం. ఎనిమిది నెలల వ్యవధిలో మూడున్నర టన్నుల దిగుబడి వచ్చింది. వ్యవసాయంతో పాటు చేప పిల్లల పెంపకం కూడా బాగుంది.

– సుగుణ, నారాయణ దంపతులు

'కటకం' మృతి విప్లవోద్యమానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న విరసం నేతలు

- విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి

బెల్లంపల్లి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సుదర్శన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్ గొప్ప విప్లవ మేధావి అని ప్రశంసించారు. విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో మేథోమదనం చేశారని గుర్తు చేశారు. దండకారణ్యంలో పార్టీ నిర్మాణానికి పునాది వేసిన వారిలో సుదర్శన్ అగ్రగణ్యుడన్నారు. ప్రజాచైతన్యంతోనే విప్లవోద్యమం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో విప్లవోద్యమం అవసరం ప్రజలకు ఎంతగానో ఉండేదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమం ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో కొనసాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయడానికి ఆదివాసీ ప్రాంతాల్లో డ్రోన్‌లతో దాడులు చేయిస్తోందన్నారు. అమరుల ఆశయ సాధనకోసం మావోయిస్టు పార్టీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, అమరులు, బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకురాలు పద్మకుమారి, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు

- బల్లార్షా-కాజీపేట మార్గంలో నిలిపివేత
- రైల్వేలైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగ తెగడంతో సమస్య
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

కాగజ్‌నగర్‌టౌన్: రైల్వేలైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగ తెగడంతో ఏర్పడిన సమస్య కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఆదివారం మధ్యాహ్నం బెల్లంపల్లి-మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్యలో రైల్వే లైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తెగింది. ఎలాంటి ప్రమాదం జరగనప్పటికీ ఆయా రైళ్లను రైల్వేస్టేషన్లలో గంటల తరబడి నిలిపివేశారు. సికింద్రాబాద్-కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్ నుంచి మధ్యాహ్నం 2:55 గంటలకు బయల్దేరాల్సి ఉండగా 6 గంటలకు బయల్దేరింది. సికింద్రాబాద్-దానపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 2:30 గంటలకు చేరుకోగా 5:30 గంటలకు బయల్దేరింది. చెన్నై-కాట్రా(అండమాన్), జీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం మూడు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. పలు గూడ్స్ రైళ్లను గంటల తరబడి ఆయా స్టేషన్లలో నిలిపివేశారు. ఈ విషయమై రైల్వే అధికారులను సంప్రదించగా బెల్లంపల్లి-మందమర్రి మధ్య సాంకేతిక సమస్య కారణంగానే ఆలస్యంగా రైళ్లు నడిచినట్లు వివరించారు.



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో నిలిచిఉన్న రైళ్లు